నెరవేరనున్న చిరకాల స్వప్నం

- కాజీపేటలో బస్టాండ్ నిర్మాణానికి అధికారుల గ్రీన్ సిగ్నల్
- కొలిక్కొచ్చిన ఎమ్మెల్యే నాయిని, ఎంపీ కావ్య ప్రయత్నాలు
- ఆనందం వ్యక్తంచేస్తున్న ప్రయాణికులు


కాజీపేటలో బస్టాండు ప్రతిపాదిత స్థలం

కాజీపేట: మూడున్నర దశాబ్దాలుగా కాజీపేట పట్టణ ప్రజలు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న బస్టాండు ఏర్పాటుకు అడుగులు వేగంగా పడుతున్నాయి. అప్పటి పీపుల్స్‌వార్ నక్సలైట్ల నుంచి మొదలు ఎన్నో పోరాటాలకు నాంది పలికిన బస్టాండు సమస్య కర్నుడి చావుకు వంద కారణాలు అన్నట్లుగా కలగానే మిగిలిపోతోంది. పట్టణ ప్రజలు ఎంతోకాలంగా బస్టాండు నిర్మాణం కోసం ఎదురు చూస్తున్నారు. ఇటు కాజీపేట రైల్వే జంక్షన్, అటు హైదరాబాద్ వైపు వెళ్లే దారిలో ఉన్న బస్టాపుకు బస్టాండు ఏర్పాటు కాకపోవడం చర్చనీయాంశంగానే మారింది. బస్టాండు పేరుతో జరిగిన ఉద్యమాల్లో భాగస్వాములైన నాయకులు ఎందరో రాజకీయ పదవులను అనుభవించారు. కానీ, ప్రజల ఆకాంక్ష మాత్రం నెరవేరలేదు. ఉద్యమ సమయంలో ఎంతోమందిపై పోలీసులు కేసులు నమోదు చేయగా జైలుకెళ్లిన ఘటనలూ ఉన్నాయి.

ఫలిస్తున్న ప్రజాప్రతినిధుల ప్రయత్నాలు

ప్రజల చిరకాల స్వప్నం నెరవేర్చాలనే లక్ష్యంతో వరంగల్ ఎంపీ కడియం కావ్య సహకారంతో రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్, డీఆర్‌ఎంలతో పాటు ఉన్నతాధికారులతో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పలు దఫాలుగా బస్టాండు ఏర్పాటు ఆవశ్యకతపై చర్చలు జరిపి సఫలీకృతం చేశారు. రైల్వే జంక్షన్ ఎదుట ఉన్న స్థలం ఇరుకుగా ఉన్న క్రమంలో ప్రయాణికుల అవసరాలకు తగ్గట్టుగా ఆర్టీసీ బస్సులు నడిపించలేని పరిస్థితిలో అధికారులు ఉన్న విషయాన్ని రైల్వే ఉన్నతాధికారులకు విన్నవించారు. రైల్వే జంక్షన్ సమీపంలో ఉన్న స్టేడియం స్థలం లేదా రైల్వే పాఠశాల స్థలాల్లో ఏదో ఒకటి బస్టాండు నిర్మాణం కోసం కేటాయిస్తే రాష్ట్ర ప్రభుత్వం తగిన పరిహారం ఇవ్వడంతో పాటు రైల్వేకు ప్రయాణికులు, సరుకు రవాణాతో ఆదాయం వస్తుందని రైల్వే అధికారులకు గణాంకాలతో సహా వివరిస్తూ ఎమ్మెల్యే వినతి పత్రాలను సమర్పించారు.

చిగురిస్తున్న ప్రయాణికుల ఆశలు

మూడున్నర దశాబ్దాల కాలం తర్వాత తిరిగి బస్టాండు నిర్మాణ విషయాన్ని రైల్వే అధికారులు అంగీకరించడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఎమ్మెల్యేలు నాయిని, కడియం శ్రీహరితో పాటు ఎంపీ కడియం కావ్య కృషి ఫలితంగా రైల్వే పరిసర ప్రాంతాలను ఏడీఆర్ఎం సందర్శించి అనుకూలంగా నివేదిక సమర్పించినట్లు తెలుస్తోంది. కాజీపేట ప్రధాన రహదారి సమీపంలోని పాఠశాల స్థలాన్ని ఇవ్వడానికి అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

రహదారి విస్తరణకు ఎమ్మెల్యే సుముఖత

కాజీపేట ప్రధాన రహదారి విస్తరణకు ఎమ్మెల్యే సుముఖత వ్యక్తం చేయడంతో ఆర్అండ్‌బీ, ఎన్‌హెచ్ అధికారులు రంగంలోకి దిగి సర్వే పూర్తిచేశారు. వారం, పది రోజుల్లో రహదారి విస్తరణకు అడ్డంకిగా ఉన్న భవనాలను తొలగించడానికి అధికారులు సిద్ధమవుతున్నారు. కొద్ది రోజుల్లోనే వ్యాపార సంస్థలకు మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేయనున్నట్లుగా సమాచారం.

ఎమ్మెల్యే కృషి ఫలిస్తే సంతోషం


చాలాకాలం తర్వాత బస్టాండు నిర్మాణం కోసం ఎమ్మెల్యే ప్రయత్నించడం ఆనందంగా ఉంది. రైల్వే అధికారులు స్పందించి బస్టాండ్‌కు అవసరమైన స్థలం ఇస్తారనే ఆశాభావంలో అందరం ఎదురు చూస్తున్నాం. ఎమ్మెల్యే కృషి ఫలించాలి.

\- రావుల నవీన్ కుమార్, చిరు వ్యాపారి

ప్రజల ఆకాంక్ష నెరవేరుతుంది


కాజీపేట పట్టణంలో ఏనాడో బస్టాండ్ నిర్మించాల్సి ఉండే. వివిధ రాజకీయ కారణాలతో ఆగిపోయిన విషయం నేడు పరిష్కారం దిశగా ముందుకు సాగడం అందరికీ ఆనందదాయకంగా ఉంది. పట్టణంలోని చిరువ్యాపారుల కష్టాలు తొలగిపోతాయి. ఆర్టీసీకి, రైల్వేకు ఆదాయం సమకూరుతుంది.

\- బొల్లికొండ కోటేశ్వర్, సోమిడి

బస్టాండ్ నిర్మించాలనే తపన


కాజీపేట పట్టణంలో ప్రజలకు ఉపయోగపడేలా బస్టాండ్ నిర్మించాలనే సంకల్పంతో చేస్తున్న ప్రయత్నాలకు అధికారులు సానుకూలంగా స్పందించడం ఆనందంగా ఉంది. రహదారి విస్తరణకు చిరువ్యాపారులు సహకరించడంతో పాటు త్యాగాలకు సిద్ధపడాలి. అప్పుడే ప్రజల ఆలోచనలకు కార్యరూపం ఇచ్చినట్లవుతుంది.

\- నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్యే, వరంగల్ పశ్చిమ

క్లుప్తంగా

వాకర్స్ అసోసియేషన్ గవర్నర్‌గా భారతి



హన్మకొండ చౌరస్తా: వాకర్స్ ఇంటర్నేషనల్ హనుమకొండ జిల్లా గవర్నర్‌గా రిటైర్డ్ కార్మిక శాఖ అధికారి కూరాకుల భారతి బాధ్యతల స్వీకారోత్సవ కార్యక్రమం హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో ఆదివారం జరిగింది. గత గవర్నర్ ప్రభావతి నుంచి బాధ్యతలు స్వీకరించిన భారతి.. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాకర్లకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. తనపై నమ్మకంతో అవకాశం కల్పించిన వాకర్లకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం, తన్వి నేమరోపతి క్లినిక్ ఆధ్వర్యంలో వాకర్లకు ఆక్యుపంచర్ వైద్య పరీక్షలు నిర్వహించారు.

మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా నంది శ్రీనివాస్

హసన్‌పర్తి: ఎర్రగట్టు గుట్ట మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా నంది శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఎర్రగట్టు వేంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో ఆదివారం ఎన్నికలు జరిగాయి. గౌరవ అధ్యక్షుడిగా తోట నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా తోట రాకేష్, ఉపాధ్యక్షులుగా బండారి యాదగిరి, సహాయ కార్యదర్శిగా గుండపు సుధాకర్, కోశాధికారిగా ఉప్పుల సంపత్, సహాయ కోశాధికారిగా గంట రాజయ్య, సభ్యులుగా కోడెల ప్రవీణ్, ఆకుతోట చిరంజీవి, సురేష్, తోట నాగరాజు ఎన్నికయ్యారు.

సత్యసాయి కాలనీ అధ్యక్షుడిగా టీఆర్‌కే రెడ్డి


హసన్‌పర్తి: 55వ డివిజన్ సత్యసాయి కాలనీ అధ్యక్షుడిగా తుమ్మ రామకృష్ణారెడ్డి (టీఆర్‌కే రెడ్డి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా పి.శ్రీధర్, గౌరవ అధ్యక్షుడిగా రాఘవరాజు, ఉపాధ్యక్షులుగా సాంబయ్య, నవీన్, కోశాధికారిగా బి.మొగిలితో పాటు మరో ఐదుగురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

బెజవాడ దుర్గమ్మను దర్శించుకున్న 'మార్నేని'


హన్మకొండ: తమ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుని తెలంగాణ స్టేట్ కో ఆపరేటివ్ ఆపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, మధుమతి దంపతులు ఆంధ్రప్రదేశ్‌లోని బెజవాడ కనదుర్గమ్మను ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు.

హైకోర్టు జడ్జి పరామర్శ


వరంగల్: వరంగల్ కాశిబుగ్గ 19వ డివిజన్ సొసైటీకాలనీలోని తన మేనమామ చామర్తి శివరాంను తెలంగాణ హైకోర్టు జడ్జి నామవరపు రాజేశ్వరరావు కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా శివరాం ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. జడ్జి వెంట వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్, ఇంతేజార్‌గంజ్ సీఐ సుకూర్, ఎస్సై సందీప్, పోలీస్, రెవెన్యూ, జిల్లా కోర్టు సిబ్బంది ఉన్నారు.

అరూరి రమేష్‌కు పరామర్శ



హన్మకొండ: బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, సంఘం నాయకులు పరామర్శించారు. అరూరి రమేష్ మాతృమూర్తి అరూరి వెంకటమ్మ మృతిచెందగా, జఫర్‌గడ్ మండలం ఉప్పుగల్ గ్రామంలోని స్వగృహంలో రమేష్‌ను ఆదివారం పరామర్శించి, వెంకటమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు పంజాల మధు గౌడ్, పెరుమాండ్ల అనిల్ గౌడ్, సమ్మయ్య, కొడారి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నీటి కష్టాలు

వేలేరు : మండలంలోని ప్రాథమిక పాఠశాలలో తాగునీటి చేతిపంపు విరిగిపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో మధ్యాహ్నం భోజన సమయంలో పక్కనే ఉన్న బోర్ సహాయంతో క్యాన్ల ద్వారా నీటిని తెప్పిస్తున్నారు. మధ్యాహ్నం భోజనం చేశాక చేతులు, ప్లేట్లు శుభ్రం చేసుకునేందుకు సరిపడా నీళ్లు లేకపోవడంతో విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చేతిపంపును బాగుచేయించాలని కోరుతున్నారు.

స్థానిక సంస్థల్లో 56శాతం సీట్లు ఇవ్వాలి

- బీసీ బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాపగిరి విజయకుమార్


మాట్లాడుతున్న బీసీ సంఘం నాయకుడు

వరంగల్: అన్ని రాజకీయ పార్టీలు 56శాతం సీట్లను బీసీలకు స్థానిక సంస్థల్లో కేటాయించాలని తెలంగాణ బీసీ బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాపగిరి విజయకుమార్ డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు కటకం విజయకుమార్ అధ్యక్షతన మట్టెవాడలో ఆదివారం జరిగిన సమావేశంలో పి.విజయకుమార్ మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణనలో గతంతో 52 – 56శాతం ఉన్నా ఇప్పుడు 46శాతం రావడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. పూర్తి వివరాలు సేకరించిన అనంతరమే ఎన్నికలు నిర్వహించాలని కోరారు. సమావేశంలో కుమ్మర, వడ్డెర, రజక సంఘాల అధ్యక్షులు ఆకారపు మోహన్, పల్లపు సమ్మయ్య, ఆనందం, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

బీసీ సబ్‌ప్లాన్ అమలుపై సమావేశం

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా బీసీ సబ్ ప్లాన్ అమలుపై చర్చించేందుకు యునైటెడ్ వరంగల్ బీసీ ఇంటలెక్చువల్స్ సంఘం ఆధ్వర్యంలో కోఆర్డినేటర్ కె.కృష్ణ అధ్యక్షతన కాశిబుగ్గలో ఆదివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కోఆర్డినేటర్లు అసోసియేట్ ప్రొఫెసర్ కె.వీరస్వామి, మండల పరశురాములు, ధర్మపురి రాజగోవిందు మాట్లాడుతూ ప్రస్తుత బీసీ సర్వే నివేదిక సరిగ్గా లేదని, వెంటనే దాన్ని సవరించి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ కల్పించాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. కార్యక్రమంలో పలు బీసీ సంఘాల నేతలు, తదితరులు పాల్గొన్నారు.

కులగణన సర్వేలో పారదర్శకత లేదు


మాట్లాడుతున్న మహ్మద్ అబ్దుల్ హన్నన్

హన్మకొండ చౌరస్తా: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణన సర్వేలో పారదర్శకత, జవాబుదారీతనం లోపించిందని జమాతే ఇస్లామి హింద్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్ హన్నన్ అన్నారు. హనుమకొండ రాయపురలోని జమాతే ఇస్లామీ హింద్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2014 నుంచి 2024కు జనాభా లెక్కలు తారుమారయ్యాయని, బీసీలు 56.33 శాతం, ఎస్సీలు 17.43, ఎస్టీలు 10.45, ఓసీలు 15.79 శాతంగా ఉన్నట్లు ప్రకటించడం ఆందోళన కలిగిస్తోందని వాపోయారు. 16 లక్షల మంది (3.1శాతం) గణనలో పాల్గొనలేదని తెలిపారు. సంస్థ రాష్ట్ర కార్యదర్శి ముజాహిద్ ఇర్ఫాన్ మాట్లాడుతూ ముస్లిం సమాజం ఎల్లప్పుడూ వెనుకబడిన, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడుతోందని చెప్పారు. కామారెడ్డి బీసీ ప్లాన్ ప్రకారం 42శాతం సీట్లు బీసీలకు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సర్వే రిపోర్టులో ఉన్న తప్పులను సరిదిద్ది, పూర్తిస్థాయి నివేదికను వెబ్‌సైట్‌లో ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ సమావేశంలో మహ్మద్ వహజుల్ హక్, సర్వత్‌అలీ ముబీన్, సైఫ్, తహసీన్, బాబర్, అబ్దుల్, అలీం, షకీల్‌సాబ్ పాల్గొన్నారు.

నడకతో ఆరోగ్యం, మానసికోల్లాసం



ప్రతినిధులను సన్మానిస్తున్న వాకర్స్

దేశాయిపేట: రోజూ తప్పకుండా నడవడం (వాకింగ్) వల్ల మంచి ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం ఏర్పడుతుందని వాకర్స్ అంతర్జాతీయ అధ్యక్షురాలు ఎం.ప్రభావతి అన్నారు. దేశాయిపేట సీకేఎం కళాశాల మైదానంలో ఫ్రెండ్స్ వాకర్స్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సన్మానంలో ఆమెతో పాటు 303ఏరియా గవర్నర్ కూరాకుల భారతి, ట్రెజరర్ సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాంత్రిక జీవనంలో మనిషి శారీరక వ్యాయామం లేకపోవడం వల్ల అనేక రోగాలకు గురవుతున్నామని అన్నారు. ఈక్రమంలో రోజూ ప్రతీఒక్కరికి కనీసం 20 నిమిషాల నడక తప్పనిసరి అని తెలిపారు. మైదానం అభివృద్ధికి తోడ్పడుతున్న అంతర్జాతీయ వాకర్ కౌన్సిలర్ చింతం సారంగపాణిని వారు అభినందించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సారంగపాణి, ప్రధాన కార్యదర్శి టి.రఘునాథరావు, సోల రవి, సుదర్శన్‌రెడ్డి, చీర్ల శ్రీనివాస్‌రెడ్డి, కొత్త నగేష్, ఎర్రం ప్రభాకర్, నూనె వేణుప్రసాద్, జంపయ్య, వాకర్స్ పాల్గొన్నారు.

హిందూ వివాహ వ్యవస్థ.. సనాతన ధర్మానికి ప్రతీక


విజేతకు బహుమతి అందజేస్తున్న ట్రస్టీలు

వరంగల్: హిందూ వివాహ వ్యవస్థ.. భారతీయ సనాతన ధర్మం, సనాతన సంప్రదాయానికి ఒక వెన్నెముక లాంటిదని పూజ గురుదేవులు శివానంద మూర్తి చెప్పేవారని శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపీచంద్ గుర్తుచేశారు. ఆరెపల్లి సమీపంలో సప్తగురుధామంలో 'హిందూ వివాహ వ్యవస్థ ప్రాధాన్యత ప్రయోజనాలు' అనే అంశంపై ఆదివారం ఏర్పాటు చేసిన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బయట దేశాల్లోని వారు కూడా హిందూ ధర్మాన్ని ఆచరించడానికి ముందుకు వస్తున్నారని అన్నారు. మరో ట్రస్టీ బండారు సాయి నారాయణ మాట్లాడుతూ ఈ పోటీలో ప్రథమ రూ.5116లు సాయి పవన్‌కుమార్‌కు, ద్వితీయ రూ.2116లు వైష్ణవి, తృతీయ రూ.1116లు సుహాసినికి నగదు బహుమతులు అందజేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు నరసింహమూర్తి, ప్రొఫెసర్ వెంకటరమణ రామన్న, సుదర్శన్, సుమతి, ట్రస్ట్ సభ్యుడు మాదారపు సదాశివుడు పాల్గొన్నారు.

వెంకటరమణారెడ్డి సేవలు మరువలేనివి


వెంకటరమణారెడ్డి - రేవతి దంపతులను అభినందిస్తున్న అతిథులు

హన్మకొండ అర్బన్: మూడు దశాబ్దాలకు పైగా నీటిపారుదల శాఖలో కంకణాల వెంకటరమణారెడ్డి అందించిన సేవలు మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు. మిషన్ భగీరథ ఈఈగా ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన వెంకట రమణారెడ్డి ఆత్మీయ అభినందన కార్యక్రమాన్ని హనుమకొండ నిట్ సమీపంలోని మయూరి గార్డెన్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వరంగల్ ఎస్ఈ ఏ.సురేందర్‌రెడ్డి అధ్యక్షత వహించగా, మిషన్ భగీరథ సీఈ కె.విజయ్‌పాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా, కరీంనగర్ సూపరింటెండెంట్ కె.రాములు విశిష్ట అతిథిగా హాజరై మాట్లాడారు. వివిధ హోదాల్లో పనిచేస్తూ మచ్చలేని అధికారిగా ఉద్యోగ విరమణ చేయడం అభినందనీయమని కొనియాడారు. ఆయన శేష జీవితం సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. అనంతరం వెంకట్రామణారెడ్డి, రేవతి దంపతులను గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, ఈఈ గట్ల మహిపాల్‌రెడ్డి, నాయకులు పులి ప్రభాకర్, సాక్షి డైరెక్టర్ కేఆర్‌పీ.రెడ్డి పాల్గొన్నారు.

స్టేషన్‌లో పోలీసుల శ్రమదానం


చెత్తను తొలగిస్తున్న పోలీస్ అధికారులు


పరిసరాలను శుభ్రం చేస్తున్న సిబ్బంది


వ్యర్థాలను ట్రాక్టర్‌లో వేస్తున్న సిబ్బంది

హసన్‌పర్తి: కాకతీయ యూనివర్సిటీ పోలీసులు ఆదివారం శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడం కోసం స్టేషన్ పరిసరాలను శుభ్రం చేసి చెత్తాచెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎస్సైలు రవీందర్, శ్రీకాంత్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు వెంట.. కోడి పెంట



హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని పెద్దమ్మగడ్డ, కేయూ ప్రధాన రహదారిలోని వెరైటీ చికెన్ సెంటర్ నిర్వాహకులు.. కోళ్లను తరలించే వాహనాల్లో పేరుకుపోయిన పెంటను రోడ్డు వెంటే తొలగిస్తున్నారు. దీంతో అటుగా వెళ్లే ప్రజలు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. దర్జాగా రోడ్డుపైనే వాహనాలను నిలిపి కోడి పెంటను తొలగించడంపై పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ ప్రజారోగ్య శాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రధాన రహదారిపై పొంచి ఉన్న ప్రమాదం



కాజీపేట: కాజీపేట పట్టణ శివారులోని మడికొండ కందాల దాబా సమీపంలో ఉన్న డివైడర్ ప్రమాదకరంగా మారింది. తరచూ డివైడర్‌ను వాహనాలు ఢీకొడుతుండడంతో అది కూలిపోతోంది. రాత్రి వేళల్లో వీధి దీపాలు సక్రమంగా వెలుగక అక్కడ డివైడర్ ఉన్నట్లు తెలియకపోవడంతో వాహనదారులు నేరుగా వెళ్లి ఢీకొని ప్రమాదాల బారిన పడుతున్నారు. వాహనాలు తగలడంతో డివైడర్ రాళ్లు కూలిపోతున్నాయి. కొంతమంది వాహనదారులు ఇతర వాహనాలను మళ్లించే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ధ్వంసమైన డివైడర్‌కు మరమ్మతులు చేసి దీపాలు వెలిగేలా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

నేటి మహాధర్నాను విజయవంతం చేయాలి

ఖిలా వరంగల్: హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి నలిగంటి రత్నమాల పిలుపునిచ్చారు. ఈమేరకు ఖిలా వరంగల్ పడమరకోటలో ఠాగూర్‌భవాని అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లి ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రమ్య, స్వప్న, రమ, మల్లికాంబ, పద్మ, సరిత, శ్రీనిధి, మహాన్విత తదితరులు పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అనిల్

ఖిలా వరంగల్: ఎస్సీలను ఏబీసీడీలుగా విభజించి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్, సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి కోరారు. వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సంగి ఎలేందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. దళితులు బాగుపడాలంటే చదువే పరిష్కారమని వివరించారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి ఎస్సీలను ఏబీసీలుగా విభవించి, దళితులకు సమాన రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. సమావేశంలో తాళ్లపల్లి జాన్‌పాల్, జన్ను రాజు, శంకర్, రాజేష్, నవీన్, సునీత, కుమారస్వామి, కోటి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు పరిశోధకులకు డాక్టరేట్


మల్లేశం


నాగచందర్

కేయూ క్యాంపస్: ఇద్దరు పరిశోధకులకు కాకతీయ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. నేషనల్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ కమిషన్ ఆఫ్ ఇండియా ఏ స్టడీ ఆన్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ ఇట్స్ రికమెండేషన్స్ ఇన్ తెలంగాణ స్టేట్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి పొలిటికల్ సైన్స్ విభాగం పరిశోధకుడు అదె మల్లేశానికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ తెలిపారు. ఆ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ సీహెచ్ దినేష్‌కుమార్ పర్యవేక్షణలో మల్లేశం తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. అలాగే, ఇంగ్లిష్ విభాగం పరిశోధకుడు పి.నాగచందర్‌కు డాక్టరేట్ ప్రకటించారు. ట్రస్ట్ విత్, ఏ స్టడీ ఆఫ్ నాయిపాల్స్ ఇండియా ట్రావెలాగ్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి నాగచందర్ డాక్టరేట్ అందజేశారు. ఇంగ్లిష్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ దామోదర్ పర్యవేక్షణలో నాగచందర్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు.

రవికుమార్ పరిశోధన పత్రం సమర్పణ


ప్రశంసపత్రం అందుకుంటున్న రవికుమార్

మామునూరు: రీజినల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఎన్సీఆర్టీ భోపాల్ ఆధ్వర్యంలో ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు జరగనున్న జాతీయ సదస్సుకు హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం పంథిని గ్రామానికి చెందిన ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు డాక్టర్ కోల రవికుమార్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కృత్రిమ మేధను బోధనా పద్ధతిలో ఏ విధంగా అనుసంధానం చేయవచ్చో అనే అంశంపై పరిశోధన పత్రాన్ని ఎన్సీఆర్టీకి రవికుమార్ సమర్పించారు. అనంతరం రవికుమార్‌కు ఎన్సీఆర్టీ అధికారులు ప్రశంసపత్రం అందజేసి అభినందించారు.

అభయాంజనేయుడి విగ్రహ ప్రతిష్ఠాపన


హోమం చేస్తున్న ఉత్సవ కమిటీ బాధ్యులు

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు ఆదివారం రెండోరోజు నేత్రపర్వంగా కొనసాగాయి. వేద పండితుడు శ్రీనివాసచార్యులు, నిర్మాణ దాత గుండ్లపల్లి వెంకటేశ్వర్లు, సరస్వతి దంపతుల ఆధ్వర్యంలో స్థానిక కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్ నేతృత్వంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఉదయం 8గంటలకు మండపారాధన, హోమం, సాయంత్రం 6గంటలకు ధాన్యది, శయ్యాదివాసం నిర్వహించి హారతి ఇచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు వేద పండితులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఎమ్మెల్సీ, స్థానిక ఎన్నికలను బహిష్కరిస్తాం

కమలాపూర్ : ఉప్పల్‌ను మండల కేంద్రంగా ప్రకటించకుంటే రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తామని మండల సాధన సమితి సభ్యులు హెచ్చరించారు. ఉప్పల్‌ను మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈమేరకు మండల సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళన ఆదివారం ఐదోరోజు కొనసాగింది. ఈ సందర్భంగా డప్పుచప్పుళ్లతో భారీ ర్యాలీ నిర్వహించి కన్నూరు క్రాస్ రోడ్డు హుజూరాబాద్ – పరకాల ప్రధాన రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఉప్పల్‌ను మండలం చేయాలని ఐదు రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని వాపోయారు. ఉప్పల్ మండల సాధన కోసం ఇప్పటికే ఉద్యమ కార్యాచరణ రూపొందించుకున్నామని, ప్రభుత్వం స్పందించకుంటే నిరసన, ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. సమాచారం అందుకున్న ఎస్సై వీరభద్రరావు వారితో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు.